చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా డివిజన్ పరిధిలోని వాంబే కాలనీలో దుర్గామాత అమ్మవారి దేవాలయంలో 8వ రోజు శ్రీ సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పాఠ్య పుస్తకాలు, పలకలు అందజేసి అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ కమిటీ సభ్యులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం



విష్ణు

మణికొండ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమైన సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... వనపర్తి జిల్లా కొత్తకోట మండలం సంకిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన మద్దిలేటి కోకాపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతని కుమారుడు విష్ణు(15) ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేక పోవటంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. బాలుడి సమాచారం తెలిసిన నార్సింగి పోలీసులకు తెలిపాజేయాలని కోరారు.

తమ్ముడి హత్య కేసులో నిందితుడి రిమాండ్

సంతోష్‌నగర్: శుభకార్యానికి ఆహ్వానించలేదనే కోపంతో తల్లితో గొడవ పడేందుకు వచ్చి సోదరుడి హత్య చేసిన కేసులో నిందితుడిని సోమవారం కంచన్‌బాగ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఇన్‌స్పెక్టర్ కమల్ కుమార్ వివరాలు వెల్లడించారు. హఫీజ్ బాబానగర్ బి-బ్లాక్ ప్రాంతంలో నివాసం ఉంటున్న షేక్ ముఖ్తార్, షేక్ ఈసా అన్నదమ్ములు. షేక్ ఈసా ను ఇటీవల బంధువు సలేహా బేగం కుమారుడు నిశ్చితార్థానికి ఆహ్వానించలేదు. దీంతో మనస్తాపానికి లోనైన షేక్ ఈసా తన తల్లి నస్రీన్ బేగంతో పాటు సోదరులు షేక్ ఇషాక్, షేక్ ముఖ్తార్‌లతో మాట్లాడేందుకు ఈ నెల 27న రాత్రి హఫీజ్‌బాబానగర్‌లోని ఇంటికి వచ్చాడు. అందరూ కలిసి మాట్లాడుతుండగా కోపోద్రిక్తుడైన షేక్ ఈసా కత్తితో సోదరుడు షేక్ ముఖ్తార్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన షేక్ ముఖ్తార్‌ను చికిత్స నిమిత్తం ఒవైసీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. షేక్ ముఖ్తార్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు షేక్ ఈసాను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



మణికొండ హుడా కాలనీలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నేతలు



మణికొండ పోచమ్మ ఆలయంలో మాజీ వైస్ చైర్మన్ తదితరులు

వైభోగం.. నవరాత్రి సంబురం



కవ్వగూడలో దుర్గామాతకు పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

దసరా నవరాత్రి ఉత్సవాలు రాజేంద్రనగర్ జోన్ పరిధిలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా అమ్మవారి ఆలయాలు ప్రత్యేక పూజలు, హోమాలు, సామూహిక కుంకుమార్చన పూజలతో అలరారుతున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు, అన్నదానం, ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. నిత్యం పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుండటంతో అమ్మవారి ఆలయాలు భక్త జన సంద్రాలవుతున్నాయి. – రాజేంద్రనగర్ జోన్ బృందం



నార్సింగిలో నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న నాయకులు



బండ్లగూడ విజయ గణపతి ఆలయంలో కుంకుమార్చన పూజల్లో మహిళలు




రాజేంద్రనగర్ టీచర్స్ కాలనీలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్



దుర్గామాతకు పూజలు నిర్వహిస్తున్న పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్



వెంకన్న గుట్ట వెంకటేశ్వర స్వామి రాలయంలో విద్యాలక్ష్మిగా...



సమతాస్ఫూర్తి కేంద్రంలో ధైర్యలక్ష్మిగా సాకేత అమ్మవారు



ధర్మగిరి ఆలయంలో సర్వస్వతీదేవిగా...



గంధంగూడలో నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్



మాణిక్యమ్మ కాలనీలో...

ఈసీ, ఎంటేరు వాగుల్లో వరద తగ్గుముఖం



కేబీ దొడ్డి శివారులో ఈసీ వాగు వరద ధాటికి కోతకు గురైన పొలాలు

శంషాబాద్ రూరల్: వాగుల్లో వరద నీరు తగ్గుముఖం పట్టింది. నాలుగు రోజుల కిందట కురిసిన భారీ వర్షానికి మండలంలోని ఈసీ, ఎంటేరు వాగులు పొంగి పొర్లాయి. తర్వాత వాన నిలిచిపోవడంతో ఈ వాగుల్లో వరదనీరు తగ్గిపోయింది. ఇదిలా ఉండగా.. కేబీ దొడ్డి-సుల్తాన్‌పల్లి మధ్య ఎంటేరు వాగులో వరదనీటి కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కేబీ దొడ్డి వద్ద ఈసీ వాగు వరద ఉధృతికి పొలాలు కోతకు గురయ్యాయి. పరీవాహక ప్రాంతల్లోని మల్కారం, సుల్తాన్‌పల్లి, కేబీ దొడ్డి గ్రామాల్లో వరి, పూల పంటలకు నష్టం వాటిల్లింది. పొలాల్లో నీరు నిలిచి పంటలు దెబ్బతిన్నాయి. అచ్చంపేటలో నంది కత్వ సమీపంలో పంట పొలాల్లో వరద నీరు చేరడంతో పత్తి, మిర్చి పంటలకు నష్టం వాటిల్లింది.



సుల్తాన్‌పల్లి శివారులో ఎంటేరు వాగులో వరద కారణంగా నిలిచిన రాకపోకలు



కాచారం వద్ద ఎంటేరు వాగులో ప్రవహిస్తున్న వరదనీరు

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

గోల్కొండ: వరద బాధితులను ఆదుకునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన మొగల్ కా నాలా వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో వరదల కారణంగా నష్టపోయిన వారికి ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతితో కలిసి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గంలో బల్దియా అధికారులతో పాటు గోల్కొండ, ఆసిఫ్‌నగర్ రెవెన్యూ కార్యాలయ సిబ్బందిలోతట్టు ప్రాంతాల్లో ఉన్న బస్తీల్లో తిరుగుతూ వరద బాధితుల జాబితాను తయారు చేస్తున్నారన్నారు. ఇళ్లు కూలిన వారితో పాటు ఇంట్లో వరద నీరు వచ్చి గృహ పరికరాలు ఇతర వస్తువులు నష్టపోయిన వారికి ప్రభుత్వం తరఫున ఆదుకుంటామన్నారు.



సరుకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

ఔటర్ సర్వీసు రోడ్డు పక్కనే అక్రమ వెంచర్?



ఔటర్ సర్వీసు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్

111 జీవో కారణంగా గుంటల లెక్కన విక్రయాలు

శంషాబాద్: అక్రమ వెంచర్లకు అనుమతి లేకపోయినా అక్రమమార్కులు మాత్రం తమ దందాను ఆపడం లేదు. జీవో 111 కారణంగా పట్టణంలో వెంచర్ ఏర్పాటుకు ఎలాంటి అనుమతి లేదు. అయినా అక్రమార్కులు తమదైన పంథాలో తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అక్రమ వెంచర్లలో ప్లాట్లుగా విభజించి చదరపు గజాల్లో రిజిస్ట్రేషన్‌కు అనుమతి లేకపోవడంతో అక్రమార్కులు వాటిరి గుంటల్లో విక్రయాలు జరుపుతున్నారు. తాజాగా పట్టణంలోని ఔటర్ సర్వీసు రోడ్డును ఆనుకుని రాజకీయ పలుకుబడి కలిగిన కొందరు వ్యక్తులు అక్రమ వెంచర్‌కు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ప్లాట్ల రాళ్లు పాతారు. విక్రయాలకు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. దీనిపై స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు.అక్రమ వెంచర్‌పై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

త్వరలో తొలగిస్తాం...

ఔటర్ సర్వీసు రోడ్డు పక్కన చేపడుతున్న అక్రమ వెంచర్ విషయం మా దృష్టికి వచ్చింది. దానిని తొలగించేందుకు నోటీసులు సిద్ధం చేశాం. త్వరలోనే అక్రమ వెంచర్‌ను తీసి వేస్తాం. జీవో 111 వెంచర్ ఏర్పాటుకు ఎలాంటి అనుమతి లేదు
– మనోహర్, టౌన్‌ప్లానింగ్ అధికారి శంషాబాద్

రాజేంద్రనగర్ డీసీపీగా యోగేష్ గౌతమ్



డీసీపీగా బాధ్యతలు చేపడుతున్న యోగేష్ గౌతమ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డీసీపీగా యోగేష్ గౌతమ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజేంద్రనగర్‌లోని డీసీపీ కార్యాలయంలో యోగేష్ గౌతమ్‌కు పూర్వపు డీసీపీ చింతమనేని శ్రీనివాస్ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా డీసీపీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ... శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వారి పట్ల పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు మెరుగైన భద్రత కలిపచాలని సూచించారు. పూర్వపు డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌కు రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, శంకర్‌పల్లి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్‌లతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది వీడ్కోలు పలికారు. నూతన డీసీపీ యోగేష్ గౌతమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

వాహనాల వేగాన్ని నియంత్రించండి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల ట్రెక్ పార్క్ వద్ద వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నివారించాలని మంచిరేవుల ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులుకు ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు రాకేష్ మాట్లాడుతూ... ట్రెక్‌పార్క్ వద్ద ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు చాలా మంది వెళ్తుంటాన్నారన్నారు. సర్వీసు రోడ్డులో వాహనాలు వేగంగా వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. స్పీడ్ బ్రేకర్లు, బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఇన్‌స్పెక్టర్‌ను కోరామన్నారు. స్థానిక నేతలు జయరాజ్, స్వామి, నర్సింగ్ రావు, నరేష్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కి వినతిపత్రం ఇస్తున్న మంచిరేవులవాసులు

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



మైలార్‌దేవ్‌పల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బాబుల్‌రెడ్డినగర్ శ్రీ పోచమ్మ ఆలయంలోని సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అక్షరాభ్యాసం చేసిన చిన్నారులకు నోట్ బుక్స్, పెన్నులు, పలకలను మాజీ వార్డు సభ్యులు సోమ శ్రీనివాస్‌గుప్తా అందజేశారు. దేవాలయ అధ్యక్షుడు శంకర్(సెంట్రింగ్), మల్లేష్, పోతురాజు, సందుల, హనుమంత్, చెన్న వెంకటేష్, కిషోర్, సందీప్, భరత్, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ధర్నా



పాల్మాకుల సొసైటీ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

శంషాబాద్ రూరల్: యూరియా కోసం రైతులు సోమవారం ధర్నా చేశారు. శంషాబాద్ మండలంలోని పాల్మాకులలో ఉన్న రైతు సేవా సహకార సంఘం వద్ద గ్రామ రైతులు ఆందోళనకు దిగారు. సొసైటీ పరిధిలోని గ్రామాల్లో పంట పొలాలకు కావాల్సిన యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో పంటలకు యూరియా వేయకుంటే దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.



అలకాపూర్ టౌన్‌షిప్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



వట్టినాగులపల్లిలో...



ఖానాపూర్‌లో...

ఘనంగా సద్దుల బతుకమ్మ



రాజేంద్రనగర్‌లో...



బండ్లగూడలో...

మణికొండ: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు ఆడిపాడే సద్దుల బతుకమ్మ ఉత్సవాలను సోమవారం నార్సింగి, మంచిరేవుల, గండిపేట, ఖానాపూర్, వట్టినాగుపల్లి, గౌలిదొడ్డి, కోకాపేట, పుప్పాలగూడ, నెక్నాంపూర్ గ్రామాలతో పాటు అలకాపూర్ టౌన్‌షిప్‌లో వైభవంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచే మహిళలు ఇళ్లను శుద్ధి చేసుకుని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సిద్ధం చేసుకున్నారు. సాయంత్రం గృహాలు, బస్తీలు, కాలనీలు, ఆలయాల వద్ద బతుకమ్మలను ఆడి చివరకు చెరువుల వద్దకు చేరుకున్నారు. బతుకమ్మలకు పూజలను నిర్వహించి చెరువులలో నిమజ్జనం చేసుకున్నారు. రకరకాల సద్దులను తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి తరువాత ఒకరికొకరు పంచి పెట్టుకున్నారు. మణికొండ గ్రామంలో మాత్రం దసరా పండగ రోజే బతుకమ్మలను నిర్వహించేందుకు మహిళలు సిద్ధం అవుతున్నారు.

బండ్లగూడలో...

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలో సద్దుల బతుకమ్మ సంబరాలు చిన్నారులు, మహిళలు, యువతులు కలిసి ఘనంగా నిర్వహించారు.

రాజేంద్రనగర్ పరిధిలో...

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్, బుద్వేల్, గ్రీన్ సిటీ, శివరాంపల్లి తదితర ప్రాంతాల్లో సోమవారం రాత్రి బతుకమ్మ పండుగను మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు.





మణికొండలో కురుమ సంఘం సభ్యులు



బుద్వేల్‌లో బతుకమ్మలను తీసుకొస్తూ...

మా మెట్రో మాక్కావాలి

- మెట్రోతో మూడు నియోజకవర్గాలకు మేలు
- కేసీఆర్ ఆనవాళ్లు తుడిచెయ్యటమే కాంగ్రెస్ ఎజెండా
- బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇంచార్జి కార్తీక్‌రెడ్డి



నార్సింగి పోలీసుల అదుపులో ఉన్న కార్తీక్‌రెడ్డి



పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: రాగద్వేషాలు లేకుండా పాలన చేస్తానని పదవిలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనవాళ్లను తుడిచెయాలనే ఏకైక లక్ష్యంతో పనిచేస్తూ రాష్ట్రానికి, రంగారెడ్డి జిల్లాకు తీరని అన్యాయం చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. శేరిలింగంపల్లిలోని మైండ్ స్పేస్ వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శంషాబాద్ వరకు మెట్రో విస్తరణకు వేసిన శిలాఫలకం వద్ద సోమవారం నిరసన తెలిపేందుకు వెళ్లిన ఆయనను పోలీసులు అరెస్టు చేసి నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరికొందరు నాయకులను మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయనను వెంటనే విడుదల చేయాలని నార్సింగి పోలీస్ స్టేషన్ ముందు పార్టీ నాయకులు ఆందోళనకు దిగారు. దాంతో పోలీసులు విడుదల చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్ ఆనవాళ్లుగా ఉన్న మెట్రో ప్రాజెక్టును రద్దు చేయటంతో శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల నియోజకవర్గాల ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారు. ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీ మారి నియోజకవర్గాల ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. సెక్రటేరియట్ నుంచి పాలన చేయకపోవటం, వాహనాలకు టీఎస్ ఉన్న దాన్ని టీజీగా మార్చటం, కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకపోవటం చూస్తుంటే కక్ష సాధింపు పాలన చేస్తున్నట్టుగా ఉందన్నారు.

మెట్రోను సాధిస్తాం...

రాజేంద్రనగర్ నియోజకవర్గానికి వరప్రదాయినిగా ఉండే మెట్రో ప్రాజెక్టును సాధించి తీరుతామని కార్తీక్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉద్యమాన్ని ఇపుడు ప్రారంభించామని, రాబోయే రోజుల్లో ప్రజా ఉద్యమంగా మారుస్తామన్నారు. మెట్రో రైలు వస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందని, ఆస్తుల విలువ, అద్దెల విలువ పెరుగుతుందన్నారు. ఊరు, పేరు లేని ఫ్యూచర్ సిటీకి మెట్రో వేయాలనుకోవటం, ఇప్పటికే అభివృద్ధి చెందిన రాజేంద్రనగర్ నియోజకవర్గానికి టెండర్లు పూర్తయిన ప్రాజెక్టును రద్దు చేయటం సిగ్గుచేటన్నారు. ఇకనైనా ప్రభుత్వం దిగి వచ్చి శంషాబాద్ మెట్రో ప్రాజెక్టు పనులను ప్రారంభించాలన్నారు. నార్సింగి, మణికొండ, బండ్లగూడల బీఆర్ఎస్ అధ్యక్షులు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, డి.సీతారాం, నాగరాజులతో పాటు సీనియర్ నాయకులు కౌలన్ సుభాష్‌రెడ్డి, వెంకటేష్, రాముయాదవ్, రఘుయాదవ్, బి.సతీష్, అరుణరెడ్డి, సరితలతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.